ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
చిత్తూరు
జిల్లా వార్తలు
సోమవారం 1 సెప్టెంబరు 2025



బైబై గణేశా!



నడిరోడ్డుపై ఇరుక్కుపోయిన గణేశుడి ప్రతిమ - వినాయక ప్రతిమలను నిమజ్జనానికి తీసుకొచ్చిన భక్తులు

చిత్తూరు కట్టమంచి చెరువులో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల వెలుగుల్లో వినాయక ప్రతిమల నిమజ్జనం

- చిత్తూరులో కోలాహలంగా వినాయక ప్రతిమల నిమజ్జనం

చిత్తూరులోని కట్టమంచి చెరువులో వినాయక ప్రతిమల నిమజ్జనం ఆదివారం కోలాహలంగా జరిగింది. గిరింపేట, రెడ్డిగుంట, గంగనపల్లె, రాంనగర్ కాలనీ, మిట్టూరు, కొండమిట్ట, భరత్ నగర్, కొంగారెడ్డిపల్లె, ఎస్టేట్, కట్టమంచి, మురకంబట్టు, సంతపేట తదితర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున వినాయక ప్రతిమలను ఆయా మండపాల నిర్వాహకులు, స్థానికులు తీసుకొచ్చారు. రాత్రి తొమ్మిది గంటల సమయానికే 50 ప్రతిమల వరకు నిమజ్జనం చేశారని అధికారులు తెలిపారు.

- చిత్తూరు కల్చరల్, ఆంధ్రజ్యోతి

నేటినుంచి 'ఎన్టీఆర్ భరోసా'
పింఛన్ల పంపిణీ

- ఎవరికీ కోతల్లేకుండా నగదు అందజేయనున్న ప్రభుత్వం
- గత నెల జాబితానే కొనసాగింపు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం నుంచి ప్రారంభిస్తారు. ఎవరికీ ఎలాంటి కోతల్లేకుండా పింఛను సొమ్మును ప్రభుత్వం అందజేయనుంది. ఇందుకోసం గత నెల పింఛన్ జాబితానే ఈనెలలోనూ కొనగిస్తూ జారీచేసిన ఉత్తర్వులు ఆదివారం డీఆర్‌డీఏ అధికారులకు అందాయి. ఈ క్రమంలో 2,69,812కు మందికి పింఛను నగదును యథావిధిగా అందజేయనున్నారు. ఇందుకోసం రూ.115.29 కోట్లు జిల్లాకు వచ్చాయి. వీటిని గ్రామ, వార్డు ఉద్యోగులు బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని పంపిణీకి సిద్ధంగా ఉంచుకున్నారు. సోమవారం ఉదయం 6.30 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు సచివాలయ ఉద్యోగులు వెళ్లి నగదు అందజేయనున్నారు. ఈ మేరకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి విజ్ఞప్తులను తీసుకుంటారని తెలిపారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లోనూ అధికారులు పీజీఆర్ఎస్ నిర్వహించాలని సూచించారు.

- జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

23 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడిచిన 24 గంటల్లో 23 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాల వారీగా.. నింద్ర, విజయపురంలో 40.2, నగరిలో 29.6, కార్వేటినగరంలో 28.4, పెనుమూరులో 23, సోమలలో 22.6, చౌడేపల్లెలో 21, ఎస్ఆర్‌పురంలో 16.2, పులిచెర్లలో 14.2, గంగాధరనెల్లూరులో 12, రొంపిచెర్లలో 6.4, వెదురుకుప్పంలో 5, పూతలపట్టులో 8.2, పుంగనూరులో 6.4, పాలసముద్రంలో 6.2, పెద్ద పంజాణిలో 5.2, గంగవరంలో 3.4, తవణంపల్లెలో 3.2, చిత్తూరు రూరల్, పలమనేరులో 2.6, యాదమరిలో 1.2, గుడిపాలలో 1, ఐరాలలో 0.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

శేషుడిపై గణపతి చిద్విలాసం

- వేడుకగా కలశాల ఊరేగింపు



స్వర్ణ పెద్ద శేష వాహనంపై సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు ఆదివారం స్వర్ణ పెద్ద శేష వాహనంపై విహరించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, వడ్రాంపల్లె, మిట్టఇండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాలకు చెందిన కమ్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో మూల విరాట్‌కు పంచామృత అభిషేకాన్ని నిర్వహించారు. ఉత్సవర్లను చిన్న శేష వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఉభయదారులు కలశాల ఊరేగింపును వేడుకగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, కళాకారుల కోలాటాల నడుమ మణికంఠేశ్వరస్వామి ఆలయం నుంచి పాలతో నింపిన కలశాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయంలోకి చేరుకున్నారు. తదనంతరం అలంకార మండపం వద్ద కల్యాణ వేదికపై ఉత్సవర్లకు క్షీరాభిషేకాన్ని శాస్త్రోక్తంగా పూర్తిచేశారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి వేలాదిగా భక్తులు విచ్చేశారు. రాత్రి ఉభయ వరుస రావడంతో ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద స్వామివారి ఉత్సవర్లకు పూజలు చేశారు. వర్షం కారణంగా అర్ధరాత్రి దాటాక స్వర్ణ పెద్ద శేష వాహనంపై ఉత్సవర్లను ఉంచి కాణిపాక పురవీధుల్లో ఊరేగించారు. కాగా, వరసిద్ధుడికి అనంతపురం జిల్లాలోని కసాపురం నెట్టికంటి అంజనేయస్వామి ఆలయం తరఫున ఈవో విజయరాజు పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు మురళీ మోహన్, జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జడ్పీటీసీ సుచిత్ర, ఆలయ ఈవో పెంచలకిషోర్, ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, మాజీ చైర్మన్ మణినాయుడు, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, పూతలపట్టు పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిధర్‌బాబు, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, మాజీ జడ్పీటీసీ లత, ఉభయదారుల సంఘ అధ్యక్షుడు ఈశ్వర్‌బాబు పాల్గొన్నారు.

కాణిపాకంలో నేడు

సోమవారం ఉదయం వరసిద్ధుడికి చిలుక వాహన సేవ, రాత్రి వృషభ వాహన సేవ నిర్వహించనున్నారు.



వరసిద్ధుడికి పట్టువస్త్రాలు తీసుకొచ్చిన కసాపురం ఆలయ ఈవో విజయరాజు



కాణిపాకం పుర వీధుల్లో క్షీర కలశాలను ఊరేగిస్తున్న ఉభయదారులు, భక్తులు

పంటలపై మళ్లీ 'గజ'దాడులు

- ఆందోళనలో రైతులు



కల్లూరు సమీపంలో రోడ్డు దాటుతున్న ఏనుగు

కల్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు మళ్లీ మొదలయ్యాయి. కొన్ని నెలలుగా పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపు ఆగస్టు 17వ తేదీన తిరుపతి జిల్లా పాకాల మండలంలోకి వెళ్లిపోవడంతో మండల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ముగ్గురోజులపాటు పాకాల మండలం పదిపుట్లబైలు పంచాయతీ పరిధిలో తిష్ట వేసిన ఏనుగుల గుంపు చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిని దాటుకుని పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని ఐరాల సెక్షన్‌లోకి వెళ్లిపోయాయి. మామిడికాయల సీజన్ కూడా పూర్తవడంతో ఏనుగుల గుంపు తిరిగిరాకుండా అటు నుంచి అటే వెళ్లిపోతాయని ప్రజలు భావించారు. అయితే శనివారం రాత్రి ఉన్నట్టుండి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి శనివారం రాత్రి బయల్దేరిన 13 ఏనుగుల గుంపు కల్లూరులోని ఖాదర్‌బాషాకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. అక్కడినుంచి పాతపేట వద్దకెళ్లి గ్రామంలోని రామ్మూర్తికి చెందిన కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. సమీపంలో ఉన్న కల్లూరులోని సాధిక్, నవాబ్‌కు చెందిన మామిడి, కొబ్బరిచెట్లను విరిచేశాయి. మంగళంపేటలోని రామకృష్ణయ్యకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేసి, చిట్టారెడ్డిపేట సమీపంలో జూలై 5న ఏనుగు మృతి చెందిన ప్రాంతానికి చేరుకున్నాయి. పూరేడువాండ్లపల్లెలోని గుర్రప్పకు చెందిన వరిపంటను తొక్కేశాయి. అక్కడినుంచి ఆవులపెద్దిరెడ్డిగారిపల్లె సమీపానికి చేరుకున్న ఏనుగులు.. ఘీంకరిస్తూ వచ్చిన దారిలోనే తిరుగుముఖం పట్టాయి.

రోడ్డుపై ఒంటరి ఏనుగు హల్‌చల్

ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో కల్లూరు నుంచి గంటావారిపల్లెకి వెళ్లే రోడ్డుపై ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. రోడ్డుపై కొంతదూరం నడవడాన్ని చూసిన జనం భయపడ్డారు. అనంతరం పొలాల్లో తిరుగుతూ అడవిలో ఉన్న ఏనుగుల గుంపులోకి చేరుకుంది. పగలంతా పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక సమీపంలో ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.



ఏనుగుల గుంపు దాడిలో ధ్వంసమైన వరి

తోతాపురి సబ్సిడీ రూ.160 కోట్లు

- ఈ నెలలోనే 50వేల మంది రైతులకు విడతలవారీగా అందే అవకాశం



గుడిపాల మండలంలోని 197 రామాపురం రైతుసేవా కేంద్రంలో తోతాపురి రైతులతో జరిగిన సమావేశం (ఫైల్ ఫొటో)

చిత్తూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తోతాపురి రైతులకు ప్రభుత్వ సబ్సిడీని ఈ నెలలోనే అందించడానికి జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. సుమారు 50వేల మంది రైతులకు రూ.160 కోట్ల వరకు జమ చేయనున్నారు. ఈసారి తోతాపురి మామిడి ధరలు ఘోరంగా పతనమయ్యాయి. రైతులు ఆందోళనలు చేయకముందే పరిస్థితి అర్థం చేసుకున్న సీఎం చంద్రబాబు కిలోకు రూ.4 సబ్సిడీ ప్రకటించిన విషయం తెలిసిందే. సీజన్‌లో కిలోకు రూ.6 ఇచ్చిన ఫ్యాక్టరీలు.. సీజన్ ముగిసే సమయానికి రూ.8 కూడా ఇచ్చాయి. ర్యాంపులు కూడా రూ.3 నుంచి చివర్లో రూ.8 వరకు ఇచ్చాయి. ప్రభుత్వం రూ.4 ప్రకటించడంతో రైతులకు ఉపశమనం లభించింది. ఆ తర్వాత సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయడంతో కిలోకు రూ.1.86 ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. మిగిలిన సొమ్ము రాష్ట్ర ప్రభుత్వం మిగతా 5వ పేజీలో...

కానిస్టేబుల్ అభ్యర్థులకు రేపటినుంచి వైద్య పరీక్షలు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం నుంచి ఈనెల ఏడో తేదీవరకు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆయా తేదీల్లో ఉదయం ఆరు గంటలకు ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పక్కనే ఉన్న పాత పోలీసు కార్యాలయం వద్దకు చేరుకోవాలన్నారు.

రిజిస్ట్రేషన్ నెంబర్ల వారీగా.. : మహిళా విభాగం (సివిల్): మంగళవారం 4002466 నుంచి 4152206 వరకు ● బుధవారం 4155558 నుంచి 4481787 వరకు, ● పురుష విభాగంలో.. (సివిల్, ఏపీఎస్పీ): 4న 4004185నుంచి 4093554 వరకు, 5న 409465 నుంచి4174863 వరకు, 6న 4179694 నుంచి 4252641 వరకు, 7న 4254681 నుంచి 4504895 వరకు వైద్య పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులు హాల్ టికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకురావాలి.

రేషన్ లెక్క.. ఇక పక్కా!
- ప్రత్యేక యాప్‌తో అవకతవకలకు చెక్

పలమనేరులో భారీ చోరీ
- 700 గ్రాములకుపైగా బంగారు నగల అపహరణ

అండర్‌పాస్ కోసం మృతదేహంతో నిరసన

వివరాలు 5లో

రేషన్ లెక్క.. ఇక పక్కా!

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో పౌరసరఫరాల అధికారి ఇటీవల ఒక చౌక దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ-పోస్‌లోని సరుకుల నిల్వను పరిశీలించారు. సెల్‌ఫోన్‌లోని యాప్‌లో ఉన్న వివరాలను పోలిస్తే తేడా వచ్చింది. ఈ-పోస్ మిషన్‌ను స్వాధీనం చేసుకుని మరో డీలర్‌కు చౌకదుకాణ బాధ్యతను అప్పగించారు. పౌరసరఫరాల వ్యవస్థ ప్రక్షాళన దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న ఇలాంటి చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. రేషన్ షాపుల్లో అవకతవకలకు చెక్ పెట్టేందుకు 'ఎఫ్‌పీఎస్ ఇన్‌స్పెక్షన్' పేరిట ప్రత్యేక యాప్‌ను ఇటీవల ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. సరుకుల పంపిణీలోని అక్రమాలను నిరోధించేందుకు ఈ యాప్ ఉపకరిస్తుంది. పౌరసరఫరాల శాఖలోని అధికారులు తహసీల్దార్,

ప్రత్యేక యాప్‌తో అవకతవకలకు చెక్

డిప్యూటీ తహసీల్దార్, ఏఎస్వో, డీఎస్వో, ఆర్డీవో, జేసీ నుంచి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరకు ఈ యాప్ సాయంతో రేషన్ దుకాణాల్లోని సరుకులను ఎప్పుడైనా తనిఖీ చేయవచ్చు. ప్రస్తుతం నెలలో 1నుంచి 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ జరుగుతోంది. 15నుంచి 25వ తేదీ మధ్య పంపిణీ ఉండదు. తిరిగి 25వ తేదీనుంచి ఇండ్ల వద్దకే రేషన్ పంపిణీ జరుగుతోంది. నెలలో ఏ రోజైనా ఎఫ్‌పీల్లో తనిఖీ చేసే అధికారం అధికారులకు ప్రభుత్వం కల్పించింది. 15-20 తేదీల మధ్య కూడా పంపిణీ లేకున్నా.. దుకాణాల్లో నిల్వ, కార్డుదారుల వివరాలను తనిఖీ చేయవచ్చు. గతంలో మాదిరిగా మొక్కుబడి తనిఖీలు చేసేందుకు వీల్లేకపోవడంతో రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలను అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

ఎలా అంటే..

జిల్లాలో 5,34,721 మంది కార్డుదారులకు 1379మంది డీలర్ల ద్వారా 8500 టన్నుల బియ్యం ప్రతినెలా పంపిణీ అవుతోంది. మాన్యువల్ విధానంలో తప్పుల సర్దుబాటుకు ఇన్నాళ్లూ ఆస్కారం ఉండేది. ప్రస్తుతం అధికారులు చౌకదుకాణాల తనిఖీకి వెళ్లిన వెంటనే ఈ-పోస్‌ను తీసుకుంటున్నారు. అందులోని వివరాలు, యాప్‌లో ఉన్న ఆన్‌లైన్ వివరాలతో సరిపోలుస్తున్నారు. తేడాలుంటే అక్కడికక్కడే చర్యలు తీసుకుంటున్నారు. తనిఖీల సమయంలోనే కార్డుదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను సైతం యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రధానంగా సరుకుల సరఫరా, తూకం సక్రమంగా ఉన్నది, లేనిది.. డీలర్ల ప్రవర్తనకు సంబంధించి పలు అంశాలపై కార్డుదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

విశ్రాంత ఉద్యోగి తల్లిదండ్రుల మాలదీక్ష స్వీకరణ


తల్లిదండ్రుల మాల వేసుకుంటున్న విశ్రాంత ఏడీసీ కేశవులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాల,గోవింద మాల ఇలా రకరకాల దీక్షల గురించి విన్నాం. కానీ ఓ విశ్రాంత ఉద్యోగి వినూత్నంగా తల్లిదండ్రుల మాల వేసుకున్నారు. తాను పదేళ్లుగా ఈ దీక్ష చేపడుతున్నట్లు దేవదాయశాఖ విశ్రాంత ఏడీసీ జి.కేశవులు తెలిపారు. ఆదివారం ఆయన కాణిపాకంలో తల్లిదండ్రుల మాల దీక్ష స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను ఎవరూ చులకనగా చూడవద్దని హితవు పలికారు. వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవాలన్నారు. దీనికి గుర్తుగా తాను అయ్యప్ప మాల తరహాలో తల్లిదండ్రుల మాల వేసినట్లు తెలిపారు. ఈ మాలకు ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోందన్నారు. తాను ఇప్పటికి 10 సంవత్సరాలుగా మాల వేసుకుంటున్నానన్నారు.

మద్యం తాగి చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


చేపలవేటకు వెళ్లి మృతిచెందిన సురేష్

బంగారుపాళ్యం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మొగిలి పంచాయతీ మొగిలిమిట్టూరుకు చెందిన పరదేశి కుమారుడు సురేష్(37) ఆదివారం చేపలవేటకు వెళ్లి మృతిచెందాడు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. సురేష్ పూటుగా మద్యం తాగి ఆదివారం మధ్యాహ్నం గౌనిచెరువులోకి వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయాడు. నీటిలో తేలియాడుతున్న అతడ్ని వినాయక నిమజ్జనానికి వెళ్లిన గ్రామస్తులు గమనించారు. వెంటనే బయటకు తీశారు. అప్పటికే సురేష్ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ దుర్మరణం


మృతురాలు ఆరిఫా

యాదమరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదంలో ఓ మహిళ మరణించింది. ఎస్‌ఐ ఈశ్వర్ కథనం మేరకు ... దళవాయిపల్లె పంచాయతీ నూరేనగర్ గ్రామానికి చెందిన అరీఫా (40) ఆదివారం ఉదయం ఇంట్లోని నీటి మోటర్ స్విచ్ ఆన్ చేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై స్పృహ కోల్పోయింది. వెంటనే ఆమె భర్త కలందర్ స్థానికుల సహకారంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి కుమారుడు సైన్యంలో పనిచేస్తుండగా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అండర్‌పాస్ కోసం మృతదేహంతో నిరసన


రొంపిచెర్ల క్రాస్‌లో రోడ్డుపై గ్రామస్తుల నిరసన

రొంపిచెర్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిలోని రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని ఆదివారం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ చల్లావారిపల్లె, పెద్దకురవపల్లె గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి ఈ మేరకు నిరసన తెలిపారు. చల్లావారిపల్లెకు చెందిన బి.జయచంద్ర శనివారం రోడ్డు దాటుతుండగా పీలేరు నుంచి తిరుపతి వెళుతున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి నిరసన తెలిపారు. రొంపిచెర్ల ఎస్‌ఐ సుబ్బారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రొంపిచెర్ల క్రాస్‌లో అండర్‌పాస్ లేకపోవడం వల్లే జయచంద్ర చనిపోయాడని.. సమీపంలో పాఠశాల ఉందని, పిల్లలకు ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని వాపోయారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని, ప్రమాదం చేసిన వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సర్దిచెప్పడంతో నిరసన విరమించారు.

నగర నడిబొడ్డున ఇరుక్కున్న గణేశుడి ప్రతిమ

- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- మిట్టూరులో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం



చిత్తూరు అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర బొడ్డున ఓ వినాయక ప్రతిమ ఇరుక్కుపోయింది. దీనివల్ల మిట్టూరులో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దుర్గానగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన భారీ వినాయక ప్రతిమను ఐదు కిలోమీటర్ల దూరం నుంచి గిరింపేట, రిలయన్స్ మార్ట్, ఎంఎస్ఆర్ సర్కిల్, గాంధీ సర్కిల్, కోర్టు మీదుగా కట్టమంచి చెరువుకు తీసుకెళ్లాలి. ఈ క్రమంలో ప్రతిమను ట్రాక్టర్‌లో తీసుకొస్తుండగా ఎంఎస్ఆర్ సర్కిల్ వద్దకొచ్చేసరికి జోయలుక్కాస్ వద్ద ఉన్న స్తంభానికి తగులుకుని నడిరోడ్డుపై ఇరుక్కుపోయింది. దీనివల్ల తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లాల్సిన వాహనాలతోపాటు తిరుపతి, పుత్తూరు వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్తంభానికి తగులుకోవడంతో మిట్టూరు ప్రాంతానికి రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏఎస్పీ రాజశేఖర్‌రాజుతోపాటు సీఐలు నెట్టికంఠయ్య, మహేశ్వర, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సాయంతో ప్రతిమను స్తంభం నుంచి పక్కకు తప్పించి, కట్టమంచి చెరువుకు తరలించారు. కాగా, నగరం విస్తరిస్తున్న దృష్ట్యా దుర్గానగర్ కాలనీ, గంగినేని చెరువుల్లో కూడా వినాయక ప్రతిమల నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు చేసి ఉంటే ఇటువంటి సమస్యలు తలెత్తేవి కావని స్థానికులు అంటున్నారు.

టమోటా ధరల పతనం

- పుంగనూరులో కిలో రూ.21

పుంగనూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో కేవలం పది రోజుల్లోనే కిలో టమోటా ధరలు రూ.45 నుంచి రూ.21కి పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, మదనపల్లె, పలమనేరు, వి.కోట, గుర్రంకొండ, కలికిరి, సోమల, మొలకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీల నుంచి ప్రధానంగా తమిళనాడు, మహారాష్ట్రతోపాటు కోస్తా తదితర ప్రాంతాలకు టమోటాలు రవాణా అయ్యేది. అయితే అక్కడ టమోటా రావడంతో పదిరోజులుగా ధరలు తగ్గుముఖం పట్టాయి. ఆగస్టు 19న పుంగనూరులో కిలో టమోటా మొదటి రకం రూ.44.70, రెండో రకం రూ.37.40, మూడోరకం రూ.30 పలికాయి. ఆదివారానికి మొదటి రకం రూ.21.40, రెండోరకం రూ.18, మూడోరకం రూ.16 చొప్పున పలికింది. మహారాష్ట్ర టమోటా వ్యాపారులకు అక్కడ లోకల్ టమోటా రావడంతో కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు.

వాకర్లే టార్గెట్‌గా చోరీలు

- ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు
- రూ.23లక్షల ఆభరణాల స్వాధీనం


నిందితులను మీడియాకు చూపిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉదయం, సాయంత్రం వేళల్లో ఒంటరిగా వాకింగ్ చేసే మహిళల మెడలోని బంగారు ఆభరణాలను చోరీ చేసే ఇద్దరు అంతరాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.23 లక్షల విలువ చేసే 192 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను పోలీసు అతిథి గృహంలో డీఎస్పీ సాయినాథ్, సీఐలు మహేశ్వర, ఉమా మహేశ్వర్‌రావుతో కలిసి ఎస్పీ మణికంఠ ఆదివారం మీడియాకు తెలిపారు. రెండు నెలల కాలంలో చిత్తూరులోనే కాకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళలతోపాటు ఒంటరిగా ఉంటున్న మహిళల మెడలోని బంగారు ఆభరణాల దొంగతనాలపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసును ఛేదించడం కోసం ప్రత్యేక టీమును నియమించారు. ఈ బృందం వివిధ ప్రాంతాల్లో దర్యాప్తు చేసి సీసీ కెమెరాలు, సాంకేతికత ఆధారంగా తమిళనాడుకు చెందిన ముఠా సభ్యులుగా గుర్తించారు. ఈ క్రమంలో ఆదివారం చిత్తూరులోని చామంతిపురం రిలయన్స్ మార్ట్ ఎదురుగా అంసాయాసస్, మహమ్మద్ పితాలను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.20లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ.3లక్షల విలువ చేసే రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన నిందితులపై చిత్తూరు జిల్లాలో 8 కేసులు నమోదయ్యాయి. అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసులకు ఎస్పీ ప్రశంసాపత్రాలను అందించారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీలు చేసే అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను చూపుతున్న పోలీసులు

తాళం వేసిన ఇళ్లలో చోరీలు చేసే అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి పది విలువైన 109 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.42వేలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను పోలీసు అతిథి గృహంలో డీఎస్పీ సాయినాథ్, తాలూకా సీఐ నిత్యబాబు, ఎన్ఆర్‌పేట ఎస్‌ఐ నాగసౌజన్యతో కలిసి ఎస్పీ ఆదివారం మీడియాకు తెలిపారు. ఈనెల 21వ తేదీన చిత్తూరు రూరల్ మండలం బంగారెడ్డిపల్లె దళితవాడకు చెందిన మునిరాజ, శ్యామల దంపతులు ఇంటికి తాళం వేసి కూలీ పనులకు వెళ్లారు. సాయంత్రం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి లోపలున్న 65 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.42వేలను అపహరించుకెళ్లారు. దీనిపై బాధితుల ఫిర్యాదుతో ఎన్ఆర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నాగసౌజన్య, తాలూకా ఎస్‌ఐ మల్లికార్జునలు తమ సిబ్బందితో కలిసి విచారణ మొదలుపెట్టారు. ఆదివారం అందిన సాంకేతిక సమాచారంతో ఎన్ఆర్‌పేట ఏఎంసీ చెక్‌పోస్టు వద్ద తమిళనాడు రాష్ట్ర రాణిపేట జిల్లా షోలింగర్ తాలూకా సోమసముద్రానికి చెందిన ప్రశాంత్(26)ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో బంగారెడ్డిపల్లె దళితవాడ, ఎన్ఆర్‌పేటతోపాటు 2024లో పెనుమూరు మండలంలోనూ చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మూడు కేసులకు సంబంధించి అతడి వద్ద నుంచి పది లక్షల విలువైన 109 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.42వేలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ మహేశ్వర, క్రైమ్ సీఐ ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో భారీ చోరీ

700 గ్రాములకుపైగా బంగారు నగల అపహరణ


రామ్మూర్తినాయుడు ఇంట్లో బీరువాలు తెరిచి చిందరవందరగా పడేసిన దుస్తులు

పలమనేరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో భారీ చోరీ జరిగింది. దాదాపు 700 గ్రాములకుపైగా బంగారు నగలను అపహరించుకెళ్లారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పలమనేరులోని రాధా బంగ్లా వద్ద నివాసం ఉంటున్న టీడీపీ నాయకుడు రామ్మూర్తినాయుడు తమ ఇంటికి తాళాలు వేసుకుని శుక్రవారం సాయంత్రం కుటుంబీకులతో కలిసి బెంగళూరుకు వెళ్లారు. తిరిగి ఆదివారం ఉదయం కుటుంబీకులు ఇంటికి వచ్చారు. వెనుక వైపున తలుపులు తెరచి ఉండటంతో అనుమానం వచ్చి మిద్దెపైకి వెళ్లి చూడగా గదుల్లోని బీరువాలు తెరిచి, దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. 700 గ్రాములకుపైగా నగలు కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలమనేరు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. చిత్తూరునుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి, వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల కిందటి చోరీ కేసు కొలిక్కి రాకముందే..

పలమనేరులోని బాలాజీకోఆపరేటివ్ సూపర్‌బాజార్ అధ్యక్షుడు ఆర్వీ బాలాజీ ఇంట్లో నెల కిందట కూడా నగదు, నగలు చోరీకి గురయ్యాయి. ఈ కేసు కొలిక్కి రాకముందే మరో చోరీ జరగడం పోలీసులకు సవాల్‌గా మారనుంది.

వారు బంగారు నగల దొంగలు: పోలీసులు

ఆర్వీ బాలాజి, రామ్మూర్తి నాయుడు ఇళ్లలో చోరీ జరిగిన తీరు చూస్తుంటే వారు బంగారు నగల దొంగలుగా పోలీసులు పేర్కొంటున్నారు. ఎందుకంటే ఈ రెండిళ్లలోనూ దొంగలు వెండి వస్తువుల జోలికి వెళ్లలేదని తెలిపారు.

ఇద్దరు బాలుర అదృశ్యం

యాదమరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): హోప్ చిల్డ్రన్స్ హోమ్‌లోని ఇద్దరు బాలురు అదృశ్యమయ్యారు. ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు... శక్తివేలు (12), చిన్నరసు (10) అనే బాలురు ఆగస్టు 28న మధ్యాహ్నం హాస్టల్ నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై సంస్థ ఇన్‌చార్జి గాడ్లిన్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ బాలురు తమిళనాడులోని పొన్నై ప్రాంతంలో తిరుగుతుండగా ఎన్ఆర్ పేట సమీపంలోని హరి అనే వ్యక్తి తన బాతులు మేపేందుకు పనిలో పెట్టుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు సీడబ్ల్యూసీ అధికారుల సమక్షంలో ఆగస్టు 14న హోమ్ వసతిగృహానికి తీసుకువచ్చారు. వారు మళ్లీ కనిపించకుండాపోవడంతో పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం తెలిసినవారు 94409 00684 నెంబరుకు సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా జగదీష్


జగదీష్, ప్రభాకర్

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ (257) జిల్లా అధ్యక్షుడిగా వీహెచ్ జగదీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాజా మాజీ అధ్యక్షుడు కె.గోపినాథ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జైహింద్ మున్సిపల్ పాఠశాలలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా వి.ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా నవీన్‌కుమార్, అఫ్జల్ బాషా, లక్ష్మీపతి, హేమలత, కార్యదర్శులుగా వేణు, సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, హమీద్, శ్రీనివాసులు, ఆడిట్ కన్వీనర్‌గా కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మీపతి, వాసుదేవయ్య, జగన్నాథరెడ్డి, వెంకటేశులు, బాలు, ఉదయ్, షఫీన్నిసా, బాలయ్య, గౌరవ అధ్యక్షుడిగా ముక్తార్ అహ్మద్, గౌరవ సలహాదారులుగా గోపినాథ్, ప్రకాష్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా రాష్ట్ర నాయకులు అశోక్‌కుమార్, రవికుమార్ వ్యవహరించారు.

తిరుమలేశుడి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ


ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో కిటకిటలాడింది. వేదపండితులు వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వర్ణాభరణాలు, పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో, ఉపకమిషనర్ ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తోతాపురి సబ్సిడీ రూ.160 కోట్లు

(3వ పేజీ తరువాయి)

వేసుకుని మొత్తంగా రైతులకు కిలోకు రూ.4 ఇవ్వనుంది. ఆ మధ్య జరిగిన మంత్రి మండలి సమావేశంలో తోతాపురి రైతులకు నిధుల్ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.

4 లక్షల టన్నులు.. రూ.160 కోట్లు

జిల్లాలో 3.75 లక్షల టన్నుల తోతాపురి రకం కాయల్ని రైతులు అమ్మారు. 2.30 లక్షల టన్నుల్ని ఫ్యాక్టరీల్లో, 1.45 లక్షల టన్నుల్ని ర్యాంపుల్లో అమ్ముకున్నారు. మన జిల్లా రైతులు తిరుపతి జిల్లాకు తీసుకెళ్లి అమ్మిన కాయలు 20వేల టన్నులు ఉండొచ్చు. మొత్తంగా సుమారు 4 లక్షల టన్నుల కాయలకు ప్రభుత్వం రూ.4 చొప్పున రూ.160 కోట్ల సబ్సిడీ అందించనుంది.

జాబితా పరిశీలన ఇలా..

ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వహించి మామిడి రైతుల వివరాలను సేకరించిన విషయం తెలిసిందే. ఆ జాబితాలను మరోసారి రైతు సేవా కేంద్రాల్లో పరిశీలిస్తున్నారు. ముందుగా ఫ్యాక్టరీల్లో అమ్ముకున్న రైతుల జాబితా పరిశీలించగా, ర్యాంపుల జాబితా ఆలస్యంగా ప్రారంభించారు. ఇప్పటికే జాబితాల పరిశీలన పూర్తయ్యింది. ఇందులో భాగంగానే ఆయా రైతు సేవా కేంద్రాల్లో తోతాపురి రైతులతో వ్యవసాయ అధికారులు, సిబ్బంది సమావేశాలు నిర్వహించారు. ఏమైనా అభ్యంతరాలుంటే అక్కడే తీసుకుని కరెక్షన్ చేశారు.

తొలుత ఫ్యాక్టరీ రైతులకు..

తొలుత ఫ్యాక్టరీ రైతులకు సంబంధించిన 2.30 లక్షల టన్నుల డబ్బుల్ని జమ చేయనున్నారు. ఆ తర్వాత ర్యాంపుల్లో అమ్మిన 1.45 లక్షల టన్నుల కాయలకు డబ్బులు ఇవ్వనున్నారు. ఈ విషయమై కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో మాట్లాడగా, 'రైతుల అకౌంట్లలో సబ్సిడీ పడడం ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం' అన్నారు.

'నిమజ్జనం'లో అపశ్రుతి

- వినాయక ప్రతిమ కింద ఇరుక్కొని ఇద్దరు యువకుల దుర్మరణం



చరణ్, భార్గవ్

గంగవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక ప్రతిమ నిమజ్జనంలో అపశ్రుతి జరిగింది. ప్రతిమ కింద ఇరుక్కోవడంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగవరం మండలం చిన్నమనాయనిపల్లెలో వినాయక చవితి సందర్భంగా గ్రామంలో గణేశుడి ప్రతిమను ఏర్పాటు చేశారు. ఈ ప్రతిమను ఆదివారం రాత్రి నిమజ్జనం చేయడానికి గ్రామ సమీపంలోని కాకర్లకుంట చెరువు వద్దకు తీసుకెళ్లారు. చెరువు వద్ద పూజలు చేసి.. ప్రతిమను ఎత్తుకుని యువకులు నీటిలోకి దిగారు. నీటిలో ముంచే సమయంలో ప్రతిమ పట్టుతప్పి ముగ్గురు యువకులపై పడింది. ఒకరు తప్పించుకోగా, ఈత రాకపోవడంతో గ్రామానికి చెందిన భార్గవ్ (28), చరణ్(30)లకు ప్రతిమ కిందే ఇరుక్కుపోయారు. వారు ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అక్కడున్నవారు చెరువులోకి దూకి యువకులిద్దరినీ వెలుపలకు తీయగా, అప్పటికే మృతిచెందారు. విషయం తెలుసుకున్న గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చేతిలో టపాకాయలు పేలి ఒకరికి తీవ్రగాయాలు

గంగవరంలో మరో సంఘటన జరిగింది. వినాయక ప్రతిమ నిమజ్జనానికి తీసుకెళుతుండగా గ్రామానికి చెందిన చంద్రమోహన్ (45) టపాకాయలు కాలుస్తున్నాడు. ఈ సమయంలో చేతిలో ఉన్న టపాకాయలు పేలడంతో తీవ్రగాయాలయ్యాయి బాధితుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

టి.ఒడ్డూరులో అశ్లీల నృత్యాలు

- నిర్వాహకులపై కేసు నమోదు

పలమనేరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం టి.ఒడ్డూరు గ్రామంలో శనివారం రాత్రి అశ్లీల నృత్యాల నిర్వహణపై పోలీసులు కేసు నమోదు చేశారు. వినాయక చవితి సందర్భంగా గ్రామంలో శనివారం ఇతర ప్రాంతాల నుంచి ఆరుగురు మహిళా నృత్యకారులను పిలిపించి వారిచే అశ్లీల నృత్యాలు చేయించారు. వారితోపాటు గ్రామానికి చెందిన యువకులు నృత్యం చేయడం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఎలాంటి అనుమతి లేకుండా నృత్యాలు చేయడంతో నిర్వాహకులు చరణ్‌రాజు, వెంకటరమణ, తేజలపై కేసు నమోదు చేశారు.

రోగుల సేవతో నర్సింగ్ వృత్తి ధన్యం



నర్సింగ్ ద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న శాంతా నాగరాజ్, బీసీఎన్ తదితరులు

కుప్పం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రోగుల సేవలో ధన్యమయ్యే నర్సింగ్ వృత్తి పవిత్రమైందని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్, కుప్పం నర్సింగ్ కళాశాల చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్ అన్నారు. కుప్పం నర్సింగ్ కళాశాలలో ఆదివారం ఘనంగా స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి ఎంచుకున్నవారు శాంతి సహనాలతో మెలగాలని, రోగులపై దయగా ఉండాలని సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బెంగళూరు విజయనగర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత సింగరాయన్ మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభతోపాటు ఉత్తమ సేవే ప్రధానంగా ఉండాల్సిన నర్సింగ్ చాలా బాధ్యతాయుతమైన వృత్తిగా పేర్కొన్నారు. వైద్యశాస్త్రంలో వస్తున్న సాంకేతిక పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ.. అందులో అవగాహన కలిగి నిత్య వృత్తిలో అనువర్తించుకోవాలని సూచించారు. ఉత్తమ సేవ చేసేందుకు ప్రయత్నించాలన్నారు. కుప్పం నర్సింగ్ కళాశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి డిగ్రీ పట్టా పొందడమే కాకుండా.. 11 మంది డిస్టింక్షన్ సాధించడం తమకు చాలా గర్వకారణమని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. నర్సింగ్ వృత్తి పూర్తిచేసిన విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, సెక్రటరీ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణ మండపానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న దాతలు

సోమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మాణంలోని శివపార్వతుల కల్యాణ మండపానికి పలువురు దాతలు విరాళం అందజేసినట్లు ధర్మకర్త సోమశేఖర్ తెలిపారు. సోమలకు చెందిన రామిశెట్టి వెంకట్రామయ్య, రత్నమ్మ దంపతులు రూ.10 వేలు, శెట్టివారి సురేంద్ర, విజయ దంపతులు రూ.5 వేలు, దొంగరి మల్లప్ప, సిద్దమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు రామసిద్దులు కల్యాణ మండపానికి రూ.50 వేలు విలువ చేసే తలుపులు, కిటికీలు అందజేశారు. కార్యక్రమంలో మునివెంకటప్ప, లింగయ్య, చెన్నకేశవులు, శెట్టివారి మోహన్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



బగళనత్తంలో స్మార్ట్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి

రామకుప్పం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూటడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ రామకుప్పం మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు అంజనేయరెడ్డి తెలిపారు. ఆదివారం రామకుప్పం, బగళనత్తంలలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీని వారు ప్రారంభించారు. పంద్యాలమడుగులో రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, ఆనిగానూరులో వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి, ననియాలలో ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కామరాజనాయక్, 89పెద్దూరులో టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు లోకేష్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నేతలు సీతాపతి, గంట్లప్పగౌడు, శ్రీనివాసులుగౌడు, గుర్రప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, సలాంసాబ్, రామకృష్ణప్ప, బాబు, పెరుమాళ్, రవిరెడ్డి, జయశంకర్, మహేంద్రనాయుడు, శ్రీనాథరెడ్డి, టీవీరవి, ఆదిల్, బాలరాజు, సుబ్రీ, పద్మనాభరెడ్డి, మంజునాథ్, నియాజ్, విజయ్‌కుమార్‌రెడ్డి, హనీఫ్, మణీష్, శంకర్‌చలం తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పేదలకు 'మానవత' సేవలు



దాతలను సన్మానిస్తున్న మానవతసంస్థ ప్రతినిధులు

పుంగనూరు రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మానవతాసేవా సంస్థలోని సభ్యుల సమష్టి కృషితోనే పేదలకు సేవ చేస్తున్నట్లు సంస్థ పట్టణాధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత భవన్‌లో జరిగిన సమావేశంలో రెండు ఫ్రీజర్ బాక్స్‌లను దాతలు కె.కమలమ్మ, పి.రఘునాథరెడ్డిలు సంస్థకు అందజేశారు. నిస్వార్థంగా మానవత సంస్థ పుంగనూరులో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని వారి ప్రగతి వివరించారు. సమావేశంలో సంస్థ చైర్మన్ నందీశ్వరయ్య, వైస్ చైర్మన్ నానబాల గణేశ్, కార్యదర్శి నారాయణరెడ్డి, సంస్థ ప్రతినిధులు పూలత్యాగరాజు, ఆర్.హరినాథరెడ్డి, యోగా గురువు వనిత, నరసింహారెడ్డి, సుబ్రహ్మణ్యం, జగన్మోహన్‌రెడ్డి, సుధాకర్‌రావు, భక్తవత్సలరాజు, రామకృష్ణారెడ్డి, ద్వారకమ్మ, గంగులమ్మ, కమల తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ సేవలో మదనపల్లె న్యాయమూర్తి



అమ్మవారి తీర్థప్రసాదాలు అందుకుంటున్న న్యాయమూర్తి

చౌడేపల్లె, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ తల్లిని మదనపల్లె సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జయలక్ష్మీ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఆలయ మర్యాదలతో అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేత్రదానంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

పుంగనూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ నేత్ర దానం చేయడానికి ముందుకొచ్చేలా చైతన్యం తీసుకురావాలని చౌడేపల్లె ప్రభుత్వ వైద్యశాల ఆప్తమాలజిస్ట్ రహ్మత్ అలీఖాన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలకు సంబంధించి కరపత్రాలను ఆయన లయన్స్‌క్లబ్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. అలాగే బీఎంఎస్ క్లబ్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి వైద్యశిబిరంలో కుప్పం పీఈఎస్ వైద్యులు వివిధ కంటి సమస్యలున్న 50 మందిని పరీక్షించి 25 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా పీఆర్వో డాక్టర్ శివ, అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, సురేశ్ పాల్గొన్నారు.

నేడు చల్లా రామచంద్రారెడ్డి పర్యటన

కల్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి హాజరవుతున్నట్లు సింగిల్‌విండో అధ్యక్షులు ధనంజయనాయుడు, టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోనినాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న విశ్రాంత ప్రొఫెసర్ వెంకటరెడ్డి

పుంగనూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం అడవినాథునికుంటలో తల్లి నాగమ్మ వర్థంతి సందర్భంగా ఆదివారం పేదలకు విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జయరామిరెడ్డి, రామకృష్ణ, శంకర్‌రెడ్డి, విశ్రాంత బ్యాంకు మేనేజర్ రెడ్డెప్ప, పద్మ పాల్గొన్నారు.

భార్య కనిపించలేదని ఫిర్యాదు

పుంగనూరు రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): భార్య కనిపించలేదని భర్త పుంగనూరు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు... పట్టణంలోని కొత్తయిండ్లుకు చెందిన మునీంద్ర భార్య కోమల(19)తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆమె కనిపించకపోవడంతో బంధువులు, తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

శాంతిపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : శాంతిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏపీఆర్ కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. శిబిరంలో క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరిగే ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలి



మాట్లాడుతున్న సంఘ నాయకులు సోమచంద్రారెడ్డి

గంగవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు సరికొత్త బోధనతో రాణించాలని ఉపాధ్యాయ సంఘ సోమచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జీయల్‌యస్ ఫారం హైస్కూల్ హెచ్‌ఎం చెంగప్ప పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 36 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ అంకితభావంతో పనిచేశారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎంలు పరశురామ్, తాజుద్దీన్, ఉపాధ్యాయ సంఘ నేతలు వాసుదేవనాయుడు, రమణ రామయ్య, విజశేఖర్, రమ, విజయకుమార్, ఏఆర్ కుమార్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం

చిత్తూరు రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని వీరభద్రకాలనీకి చెందిన కిడ్నీ బాధితురలు రోషికి మాజీ కౌన్సిలర్ పార్థసారథినాయుడు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. రెండు కిడ్నీలు దెబ్బతినడంతో ఆమె స్విమ్స్‌లో డయాలసిస్ చేయించుకుంటోంది. కుటుంబం గడవడానికి కూడా ఇబ్బందిగా మారింది. ఈ విషయం తెలుసుకున్న పార్థసారథినాయుడు బాధితురాలి ఇంటికి వెళ్లి సాయం చేశారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం



సోమలలో లడ్డూ వేలంలో పాల్గొన్న భక్తులు



చౌడేపల్లె: నిమజ్జనానికి తరలిన టీచర్స్ కాలనీలోని వినాయకుడు



ఊరేగింపుగా నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



పుంగనూరులో చిన్నారుల వేషధారణ



గంగవరంలో నిమజ్జనానికి సాయినగర్ వినాయకుడు



బైరెడ్డిపల్లె : మూలతిమ్మేపల్లె చెరువులో నిమజ్జనం



రొంపిచెర్లలో....



గంగవరంలో సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు



శాంతిపురం మండలం తులసినాయనపల్లె గ్రామంలో ..

సోమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో భాగంగా స్వామి వారి బొడ్డులోని నాణెం, లడ్డూలకు నిర్వహించిన వేలంలో భక్తులు పోటీలు పడ్డారు. ఆదివారం సోమలలో ఐదో రోజు భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమల శెట్టివారివీధిలో శివాలయం రాయల్స్ ఆధ్వర్యంలో ఊరేగింపు చేశారు. స్వామివారి బొడ్డులోని వెండి కాయిన్‌ను మదనపల్లెకు చెందిన జగదీశ్, కుసుమ దంపతులు రూ.70 వేలకు, లడ్డూను వర్నూరప్పగారి వెంకటరమణ, పద్మావతి దంపతులు రూ.42 వేలకు దక్కించుకున్నారు. సింగంశెట్టి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు అందించారు. చౌడేపల్లె సీఐ రాంభూపాల్, ఎస్ఐ శివశంకర బందోబస్తు నిర్వహించారు.

- **చౌడేపల్లె:** గణేష్ నిమజ్జన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండలంలోని బిల్లేరు, చౌడేపల్లెలోని టీచర్స్‌కాలనీ, కేటీవీధిలో గాంధీవీధి, నాయుడు క్వార్టర్స్, చారాల, పంజానిపల్లె, సంతగేట్లతో పాటు పలు గ్రామాల్లో వినాయక ప్రతిమలు మంగళ వాయిద్యాల నడుమ, రంగులు చల్లుకుంటూ వినాయక నిమజ్జనం నిర్వహించారు. బిల్లేరులో గణేష్ లడ్డు వేలం నిర్వహించగా రూ.76 వేలు పలికింది.
- **పుంగనూరు రూరల్:** స్థానిక బజారువీధి ఆర్యవైశ్య యువశక్తి వారు ఏర్పాటు చేసిన వినాయకుడిని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కె.బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం ఊరేగించారు. అలాగే కొత్తపేట, మేలుపట్ల తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి అన్నదానాలు చేశారు. సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.
- **శాంతిపురం:** మండల పరిధిలోని దుంకుమానుపల్లె, తులసినాయనపల్లె గ్రామాల్లో గణనాథుడు నిమజ్జనోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. వినాయక చవితి ఉత్సవాలు ముగిసిన ఐదో రోజు ఆదివారం యువకులు, చిన్నారులు, మహిళలు గ్రామస్తులు కేరింతలతో గణనాథుడి నిమజ్జన వేడుకలను జరుపుకున్నారు. దుంకుమానుపల్లెలో వినాయస్వామి లడ్డును గ్రామానికి చెందిన టీడీపీ నేత ఎల్ మురుగేష్ రూ.41,500లకు దక్కించుకున్నారు.
- **గంగవరం:** గంగవరం సాయినగర్ వినాయకుడి నిమజ్జనం ఆదివారం వైభవంగా నిర్వహించారు.కార్యక్రమంలో సాయినగర్‌కు చెందిన యుగంధర్‌నాయుడు, జయచంద్రారెడ్డి, శివశంకర్‌రెడ్డి, కౌశిక్‌లతోపాటు మహిళలు పాల్గొన్నారు.
- **బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లెలోని కురబవీధి, జవుకుపాళ్యం, నెహ్రూనగర్, ఎస్సీకాలనీ, ఇందిరమ్మకాలనీ, మిట్టపల్లె తదితర చోట్ల ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను ఆదివారం ఊరేగింపు చేసి చెరువులో నిమజ్జనం చేశారు. యువకులు ఒకరిపైనొకరు రంగులు చల్లుకుంటూ ఊరేగింపులో సందడిచేశారు.
- **కల్లూరు:** పులిచెర్ల మండలంలో ఆదివారం గణనాథుని నిమజ్జనం వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. పులిచెర్ల, దిగువపోకలవారిపల్లి, కల్లూరులోని తలారివారిపల్లి, బీసీకాలనీ, పుంగనూరు రోడ్డులో ఏర్పాటుచేసిన గణనాథుని మండపంలో ఆదివారం ఉదయం స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. వాహనాల ముందు కోలాటాలు, బళ్లారిడ్రమ్స్, భజనలు నిర్వహించారు. గోగులమ్మ వంకలో ప్రతిమల నిమజ్జనం నిర్వహించారు.
- **రొంపిచెర్ల:** రొంపిచెర్ల పట్టణంలోని బజారువీధి, బలిజవీధి, వినాయకనగర్, ముత్యాలమ్మగుడివీధి పాలెం వీధులలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆదివారం ఊరేగింపు చేపట్టారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. టపాకాయలు కాల్చుతూ, రంగులు చల్లుకుంటు వాయిధాలతో నిమజ్జనాలు చేశారు.

హంద్రీ-నీవాలో జలహారతి



ఎంకే పురం వద్ద హంద్రీ-నీవాలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

శాంతిపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలంలో ప్రవహిస్తున్న కృష్ణమ్మ జలాలకు జలహారతులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం ఎంకే పురం గ్రామస్తులు గుండిశెట్టిపల్లెకు, ఎంకేపురం గ్రామానికి మధ్యలోని హంద్రీ-నీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలకు ఎంకే పురం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణా జలాలతో స్నానాలు చేసి అమ్మవారిని కొలిచారు. మండల పరిధిలోని మఠం పంచాయతీ ఎం శాంతంపల్లె, గుండిశెట్టిపల్లె, 121 పెద్దూరు, చెంగుబల్ల, చిన్నారిదొడ్డి, జల్లిగానిపల్లె, సోమాపురం, సి బండపల్లె తదితర గ్రామాల వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు కృష్ణా జలాలకు హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఉయ్యాల జయరామిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ చంద్రకళ, మురుగేష్ మాజీ సర్పంచ్ మునిరెడ్డి, బయ్యారెడ్డి, బాబు, మంజునాథ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి వేడుకలకు గొడుగుల వితరణ

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గ్రామోత్సవ నిర్వహణకు చిత్తూరు కొంగారెడ్డిపల్లెకు చెందిన కుమారస్వామినాయుడు ఆదివారం ఆరు గొడుగులను విరాళంగా అందించారు. దాతను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాతను వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు,జ్ఞాపికను అందించారు.

- కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 10 నుంచి రాత్రి 1 గంట వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం రామకుప్పంలో నిర్వహించిన ఉచిత వైద్యపరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించింది. 316 మందికి వైద్యులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. 74 మందికి అల్ట్రా సౌండ్, 61 మందికి ఎక్స్‌రే, 24 మందికి మెమొగ్రాం, 16 మందికి సోనో, 92 మందికి పాప్‌స్మీర్ పరీక్షలు నిర్వహించారు. వారిలో 30 మందిని పెద్దాసుపత్రులకు రెఫర్ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, మాజీ సర్పంచి రామకృష్ణప్ప, నేతలు సలాంసాబ్, వెంకటరమణ, ఆదిల్, టీవీ రవి, అల్లీశీన, శ్రీరాములు, బాలరాజు, మంజునాథ్, విజయ్‌కుమార్‌రెడ్డి, మురళీ, నిసార్, చాంద్‌బాషా, చలపతి, బీజేపీ నేతలు రాజసింహా, ఆంజనేయప్ప, నాగరాజు, కార్తీక్ తదితరులు శిబిరానికి వచ్చిన వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో క్యాన్సర్ ఆస్పత్రి మెడికల్ అంకాలజిస్ట్ డా.శ్రీరామకృష్ణయ్య, వైద్యులు రవిశంకర్, ప్రభాకర్, శ్రావణకుమారి, ప్రవల్లిక, రేణుక, మండలంలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల వైద్యాధికారులు. సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్యస్వామి సోమవారోత్సవాలు



సుబ్రహ్మణ్యస్వామి,



రామకుప్పంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం

రామకుప్పం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షిక సోమవారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రెండు దశాబ్దాల క్రితం ఇక్కడ స్వయంభుగా సప్తశిరస్సుల నాగసర్పాకారంతో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. ఏటా వినాయకచవితి మొదలు ఐదు సోమవారాలు ఆలయం వద్ద సోమవారోత్సవాలు ఘనంగా జరుగుతాయి. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఉత్సవాలు జరిగే ప్రతి సోమవారం వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. పలువురు భక్తులు కావళ్లు, వీపుతేర్లు సమర్పిస్తారు. మరికొందరు దవడలకు శూలాలు, శరీరంపై సూదలతోపాటు నిమ్మకాయలు గుచ్చుకుని స్వామి వారిని దర్శించుకుంటారు. సంతానం లేని దంపతులు స్వామిని దర్శించుకునే ముందు ఆలయ ఈశాన్య దిక్కున గల నాగులపుట్ట వద్ద రావి, వేప వృక్షాల కొమ్మలకు జోలెలు కడితే వారికి తప్పక సంతానభాగ్యం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అదేవిధంగా చెవులు, కళ్ళకు సంబంధించి వ్యాధులతో బాధపడేవారు వెండితో చేసిన చెవులు, కళ్ల ఆకృతులను స్వామి వారి హుండీలో వేస్తే వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందని భక్తుల నమ్మకం. సర్పదోషం కలిగిన వారు వెండితో చేసిన సర్పాకృతులను హుండీలో సమర్పిస్తే దోషనివారణ కలుగుతుందని బాగా నమ్ముతారు. ఆలయ ఆవరణలో వినాయకస్వామి, నాగులముద్దమ్మ, శనీశ్వరస్వామి, పద్మావతి, వేంకటేశ్వరస్వామి, అంజనేయస్వామి ఆలయాలతోపాటు ఆలయం వెనుక సువిశాల ప్రాంగణంలో త్రిమూర్తి, నక్షత్ర, నవగ్రహ, రాశి వనాలు ఉన్నాయి. ఐదు వారాలపాటు సాగే సోమవారోత్సవాలకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, తాగునీరు, స్నానపు గదులు, మరుగుదొడ్ల సౌకర్యం చేపట్టారు. అలాగే వేలాదిగా తరలివచ్చే భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆర్టీసీ డిపో వారు వీర్నమల, వి.కోట, కుప్పం, రాజుపేటక్రాస్ నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతారని తెలిపారు.

ముందుకు పోని మురుగుతో ఇక్కట్లు


గ్రామంలో పేరుకుపోతున్న వ్యర్థాలు

నగరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మీరాసాహెబ్‌పాళెం అపరిశుభ్రతకు కేరాఫ్‌గా నిలుస్తోంది. గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోయినా ఎవరూ పట్టించుకోకపోవడంలేదు. ఇక్కడ 150 ముస్లిం కుటుంబాలున్న ఈ గ్రామంలో పదేళ్ల క్రితం మురుగు కాలువలు నిర్మించారు. నీరు పోయే దారిలేదు. ఫలితంగా వ్యర్థాలు పేరుకుపోయాయి. మురుగునీరు పాచిపట్టి దోమలకు ఆవాసంగా మారింది. ఇటీవల జ్వర బాధితులు ఎక్కువయ్యారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఓ ప్రైవేటు వ్యక్తికి చెందిన పట్టా భూమిలో కాలువ ఏర్పాటుకు వీలుకాకపోవడంతో డ్రైనేజీల నీరు నిలిచిపోతోందంటున్నారు. గ్రామస్తుల్లో ఎక్కువ మంది పాతసామాన్ల వ్యాపారం కావడంతో చెత్తా చెదారం పేరుకుపోతోందని, పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో కృష్ణయ్య చెప్పారు.

మండలంలో పెరుగుతున్న జ్వరాలు

పెనుమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):మండలంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. రోజూ పీహెచ్‌సీలో 300 వరకు ఓపీలు నమోదవుతున్నాయి. వీరిలో జ్వరపీడితులే ఎక్కువ. గ్రామాల్లో పారిశుధ్యం సరిగా లేక జ్వరాలు పెరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఐవీఆర్ఎస్ పంచాయతీల్లో రోజూ పంచాయతీ కార్యదర్శులు చెత్త సేకరణ, పారిశుధ్య పనులు చేయిస్తున్నా కొన్ని చోట్ల డ్రైనేజీ రోడ్డుపైనే పారుతుంది. సచివాలయానికి పంపిణీ చేసిన ఫాగింగ్ యంత్రాలను ఉపయోగించిన దాఖలాలు లేవు. వీటిని వినియోగంలోకి తీసుకువచ్చి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది.

వళ్లెమ్మకు అండగా ఉంటాం : థామస్

వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం భారతంమిట్ట అటవీ ప్రాంతంలో కొన్నేళ్లుగా పూరిగుడిసెలో ఉంటున్న వళ్లెమ్మకు అండగా ఉంటామని రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ తెలిపారు. ఆమె ఇంటి వద్ద ఆటంకం కలిగించిన వారిపై చర్యలకు రెవెన్యూ, పోలీసుశాఖ వారిని ఆదేశించినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో తన జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆ కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయమిచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. త్వరలో ఎన్టీఆర్ గృహాన్ని మంజూరు చేయిస్తామన్నారు. వళ్లెమ్మ కుటుంబాన్ని ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న యుగంధర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామికి సేవా దృక్పథం ఉంటే బాధితురాలికి ఈనెలాఖరులోపు సొంత డబ్బులతో ఇల్లు నిర్మించాలని సూచించారు. చేతకాదని బహిరంగంగా చెబితే అక్టోబరు 2న తానే ఆమె ఇంటి నిర్మాణం పనులను ప్రారంభిస్తామన్నారు. ●వళ్లెమ్మ దళిత కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై దౌర్జన్యం, దాడులు చేయడం తప్ప ఏమి చేయలేదని ఎద్దేవా చేశారు. ఎస్ఆర్‌పురంలో 30 ఏళ్లుగా ఉన్న చర్చిని ఖాళీ చేయాలని కొంతమంది ఒత్తిడి చేస్తున్నారన్నారు. కలెక్టర్ స్పందించి పేద వారికి ఇళ్ల పట్టా ఇచ్చి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

తెలుగు తేజం పురస్కారం ప్రదానం



గిరిబాబు - రచయిత్రి విమలలు పురస్కారం అందుకుంటున్న దృశ్యం

వెదురుకుప్పం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరానికి చెందిన టీచరు గిరిబాబు తెలుగు తేజం పురస్కారాన్ని అందుకున్నారు. ఆయనకు ఆదివారం పల్నాడు జిల్లా నరసారావుపేటలోలో జాతీయ సాంస్కృతిక, సేవా సంస్థ, శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ ఈపురస్కారం అందజేశారు. తెలుగు భాష, తెలుగు వైభవం, తెలుగు సంస్కృతి, సంప్రదాయాల అభివృద్ధికి సాహిత్యం, కళలు, వివిధ రంగాల ద్వారా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఇచ్చారని గ్రహీత తెలిపారు.

చిత్తూరు కల్చరల్: నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం(నరసం) జిల్లా అధ్యక్షురాలు కరణం విమలకు నరసరావుపేట శ్రీ శ్రీ కళావేదిక నిర్వాహకులు తెలుగు తేజం పురస్కారంతో సత్కరించారు. తెలుగు భాషోత్సవాల్లో నిర్వహించిన కార్యక్రమంలో విమల తెలుగు భాషకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందజేశారు.

ఏఎంసీ చైర్మన్ రాజమ్మ భర్తకు నివాళి


రాజమ్మను పరామర్శిస్తున్న చినబాబు

విజయపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మహారాజపురంలో నగరి ఏఎంసీ చైర్మన్ రాజమ్మను ఆదివారం చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు పరామర్శించారు. ఆమె భర్త టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు డి.సుబ్రహ్మణ్యంరాజు కర్మక్రియలకు హాజరై నివాళులు అర్పించారు. ° చిత్తూరు పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, నాయకులు లోకేష్‌రాజు, కొండూరు దామోదరం పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న పార్థసారథి నాయుడు

చిత్తూరు రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని వీరభద్రకాలనీకి చెందిన కిడ్నీ బాధితురలు రోషికి మాజీ కౌన్సిలర్ పార్థసారథినాయుడు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. రెండు కిడ్నీలు దెబ్బతినడంతో ఆమె స్విమ్స్‌లో డయాలసిస్ చేయించుకుంటోంది. కుంటుంబం గడవడానికి కూడా ఇబ్బందిగా మారింది. ఈ విషయం తెలుసుకున్న పార్థసారథినాయుడు బాధితురాలి ఇంటికి వెళ్లి సాయం చేశారు.

చెరువు కట్టలు పట్టని అధికారులు


చిట్టి అడవిలాగా ఉన్న పాలసముద్రం చెరువుకట్ట

పాలసముద్రం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువుకట్టలపై విపరీతంగా ముళ్లకంపలు పెరిగిపోయాయి. 13 పంచాయతీల్లో 20 చెరువులున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో అధికారులు చెరువు కట్టల మీద ముళ్లకంపలను సైతం తొలగించలేదు. ముళ్లకంపలు పెరిగిపోవడంవల్ల కట్టలు బలహీనపడుతున్నాయని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. కట్టపైకి వెళ్లలేని పరిస్థితి నెలకొని ఉంది. చెరువుకట్టలపైన ముళ్లకంపలను తొలగించి, కట్టలను పటిష్టపరిచాల్సిన అవసరం ఉంది. సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిపినా నిధులు మంజూరు చేయకపోవడంతో అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శివపార్వతుల కల్యాణ మండపానికి విరాళాలు

సోమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మాణంలోని శివపార్వతుల కల్యాణ మండపానికి పలువురు దాతలు విరాళం అందజేసినట్లు ధర్మకర్త సోమశేఖర్ తెలిపారు. సోమలకు చెందిన రామిశెట్టి వెంకట్రామయ్య, రత్నమ్మ దంపతులు రూ.10 వేలు, శెట్టివారి సురేంద్ర, విజయ దంపతులు రూ.5 వేలు, దొంగరి మల్లప్ప, సిద్దమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు రామసిద్దులు కల్యాణ మండపానికి రూ.50 వేలు విలువ చేసే తలుపులు, కిటికీలు అందజేశారు. కార్యక్రమంలో మునివెంకటప్ప, లింగయ్య, చెన్నకేశవులు, శెట్టివారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం

చిత్తూరు అర్బన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరవ్వాలని కోరారు.

మృతురాలికి జనసేన నాయకుడి నివాళి



వెదురుకుప్పం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేటలో విద్యుదాఘాతంతో మృతి చెందిన సుమతి(39) మృత దేహానికి ఆదివారం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె విద్యాదాఘాతంతో మరణించిన విషయం తెలిసిందే. యుగంధర్ వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయాన్ని అందజేశారు.

నేడు పెన్షన్ల పంపిణీకి విప్ థామస్ హాజరు

వెదురుకుప్పం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మాంబేడు గ్రామ పంచాయతీ ధర్మాచెరువులో సోమవారం ఉదయం జరిగే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే థామస్ పాల్గొంటారు. అధికారులకు ఈమేరకు తెలిపారు.

పాడి ఆవు మృతిపై రైతు ఆవేదన



యాదమరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాశిరాల కొత్తూరుకు చెందిన పాడిరైతు భగవతికి చెందిన సుమారు రూ.70 వేలు విలువైన ఆవు మృతిచెందింది. రెండు రోజులుగా అనారోగ్యంగా ఉండటంతో స్థానిక పశువైద్యాధికారికి సమాచారం అందించినా సకాలంలో స్పందించలేదని రైతు ఆరోపించారు. ఆమె నిర్లక్ష్యం కారణంగానే జీవనాధారాన్ని కోల్పోయామని భగవతి కుటుంబం కన్నీటి పర్యంతం అయ్యింది. ఈ ఘటనపై గ్రామంలోని పలువురు పాడి రైతులు తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సంబంధిత పశువైద్యాధికారిపై తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పన్నూరు - పిళాసపాళెం రోడ్డు పూర్తి చేయండి


దళితవాడ వద్ద అసంపూర్తిగా పన్నూరు - పిళాసపాళెం రోడ్డు

విజయపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పన్నూరు - పిళాసపాళెం రోడ్డును పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆరు నెలల క్రితం పన్నూరు - పిళాసపాళెం రోడ్డు నిర్మాణం చేపట్టారు. కానీ పాక్షికంగా పన్నూరు దళితవాడ వద్ద సుమారు 100 మీటర్లు అసంపూర్తిగా ఉండడంతో ఇబ్బందిగా ఉందని, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధిక వర్షాలతో రైతులకు ఇబ్బంది

పాలసముద్రం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలరోజులుగా కురుస్తున్న అధిక వర్షాలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా వరి, చెరకు, కొబ్బరి తోటలకు చీడపీడలు ఆశించి పంటలకు నష్టం కలుగజేస్తున్నాయని వాపోతున్నారు. పాడిరైతులకు ఎండుగడ్డి కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. సబ్సిడీపై ఎండుగడ్డి, దాణా పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.

భవనాలున్నా సిబ్బందికి తప్పని అగచాట్లు



రామకృష్ణాపురంలో సచివాలయం-రైతుసేవాకేంద్రం భవనాలు

పెనుమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు ప్రారంభానికి ఎదురు చూస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 14 సచివాలయాలు, 13 రైతుసేవా కేంద్రాలు, 14 డిజిటల్ లైబ్రేరీలు, 5 వెల్‌నెస్ సెంటర్లు, 6 బల్క్‌మిల్క్ సెంటర్లు మంజూరయ్యాయి. సచివాలయాలనికి రూ.43 లక్షలు, రైతుసేవా కేంద్రానికి రూ.21 లక్షలు, లైబ్రేరీకి రూ.16 లక్షలు, వెల్‌నెస్‌సెంటర్‌కు రూ.17.50 లక్షలు, బల్క్‌మిల్క్ సెంటర్‌కు రూ.15.70 లక్షల వంతున వెచ్చించి నిర్మించారు. కొన్నింటికి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు చిన్న చిన్న పనులను అంపూర్తిగా వదిలేశారు. పూర్తయిన భవనాలనైనా అందుబాటులోకి తెచ్చుకుంటే ఉపయోగకరంగా ఉంటాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. లేకుంటే ప్రజాధనం వృథా అవుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈదిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. రామక్రిష్ణాపురం, పులికల్లు, శాతంభాకం భవనాలు పూర్తయినా సచివాలయాలు పంచాయతీ కార్యాలయాల్లోనే కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల సచివాలయ సిబ్బంది ఇరుకు గదుల్లో విధులు నిర్వర్తిస్తూ ఇబ్బంది పడుతున్నారు.



కాణిపాక వరసిద్ది వినాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో కళాకారుల కోలాటం-క్షీరాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీ మోహన్, ఈవో పెంచలకిషోర్




ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న ఉభయదారులు -గొడుగులను వితరణ చేస్తున్న దాత- ఉత్సవర్లకు క్షీరాభిషేకం

వరసిద్ధుడి వేడుకలకు గొడుగుల వితరణ

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గ్రామోత్సవ నిర్వహణకు చిత్తూరు కొంగారెడ్డిపల్లెకు చెందిన కుమారస్వామినాయుడు ఆదివారం ఆరు గొడుగులను విరాళంగా అందించారు. దాతను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అలంకార మండపం వద్ద దాతను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు,జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

●కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 10 నుంచి రాత్రి 1 గంట వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు ఆధ్యాత్మికతను చాటుతున్నాయి.

క్రికెట్ కప్ విజేత పెద్దతయ్యూరు జట్టు


పెద్దతయ్యూరు టీముకు కప్ అందజేస్తున్న ధనంజయనాయుడు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ప్రయివేట్ ఉద్యోగాల ఎంపికలో ప్రాధాన్యత లభిస్తుందని జిల్లా టీడీపీ తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు అన్నారు. వరత్తూరు పంచాయతీ దళవాయిపల్లెలో డీవీపీ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. వేర్వేరు మండలాలనుండి 21 క్రికెట్‌టీమ్‌లు ఇందులో పాల్గొన్నాయి. శ్రీరంగరాజుపురం మండలానికి చెందిన పెద్దతయ్యూరు క్రికెట్ టీమ్ మొదటి బహుమతి గెలుపొంది ట్రోఫీ కప్‌తో పాటు రూ.50వేల నగదు అందుకుఉంది, చిన్నతయ్యూరు క్రికెట్‌టీమ్ ద్వితీయ బహుమతి కింది రూ.30వేలు పొందింది. టోర్నమెంట్ ఆర్గనైజర్స్, టీడీపీ నేత బహుమతులను అందజేశారు. ట్రోఫీ కప్‌లను టీడీపీ నేత దేవపత్ని ధనంజయనాయుడు స్పాన్సర్ చేశారు. డీవీపీ స్పోర్ట్స్ క్లబ్ క్రికెట్ ఆర్గనైజర్స్ రాజేంద్రరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వెంకటేష్ రెడ్డి, ఎస్.ప్రకాష్ రెడ్డి, సురేష్ రెడ్డి, ఢిల్లీబాబు, సతీష్‌బాబు, దేవదాస్, అమాసయ్య పాల్గొన్నారు.

నిధులు లేక.. పనులు ముందుకు సాగక..


సీడీకండ్రిగ పంచాయతీ భవన నిర్మాణం దుస్థితి


పునాది దశ దాటని హెల్త్ క్లీనిక్

వెదురుకుప్పం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఆర్భాటాలు తప్ప అభివృద్ధి జరగలేదనడానికి ఈ అసంపూర్తి భవనాలే నిదర్శనం. కార్వేటినగరం మండలం సీడీకండ్రిగలో అసంపూర్తిగా అధ్వానంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల భవనాలే. ఆర్భాటంగా భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేశామని ప్రకటనలు గుప్పించి, నిధులివ్వక పనులు ముందుకు సాగక ఇలా దౌర్భాగ్యస్థితిలో కనిపిస్తున్నాయి. సీడీకండ్రిగలో పంచాయతీ భవన నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయి పిచ్చి మొక్కల మధ్య వైసీపీ పాలనకు అద్దం పడుతోంది. ఇక విలేజ్ హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణం పునాదుల దశ దాటకుండా ఆగిపోయింది. ఆ పునాదుల చోట పశువుల పాకగా మారిపోయింది. వీటిపై దృష్టి సారించి భవన నిర్మాణాలు పూర్తి చేయించి ప్రభుత్వ కార్యాలయాలకు వసతి భవనాలు కల్పించాల్సి ఉంది.

నేటి నుంచి సుబ్రహ్మణ్యస్వామి సోమవారోత్సవాలు

రామకుప్పం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షిక సోమవారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రెండు దశాబ్దాల క్రితం ఇక్కడ స్వయంభుగా సప్తశిరస్సుల నాగసర్పాకారంతో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. ఏటా వినాయకచవితి మొదలు ఐదు సోమవారాలు ఆలయం వద్ద సోమవారోత్సవాలు ఘనంగా జరుగుతాయి. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఉత్సవాలు జరిగే ప్రతి సోమవారం వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. పలువురు భక్తులు కావళ్లు, వీపుతేర్లు సమర్పిస్తారు. మరికొందరు దవడలకు శూలాలు, శరీరంపై సూదలతోపాటు నిమ్మకాయలు గుచ్చుకుని స్వామి వారిని దర్శించుకుంటారు. సంతానం లేని దంపతులు స్వామిని దర్శించుకునే ముందు ఆలయ ఈశాన్య దిక్కున గల నాగులపుట్ట వద్ద రావి, వేప వృక్షాల కొమ్మలకు జోలెలు కడితే వారికి తప్పక సంతానభాగ్యం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అదేవిధంగా చెవులు, కళ్లకు సంబంధించి వ్యాధులతో బాధపడేవారు వెండితో చేసిన చెవులు, కళ్ల ఆకృతులను స్వామి వారి హుండీలో వేస్తే వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందని భక్తుల నమ్మకం. సర్పదోషం కలిగిన వారు వెండితో చేసిన సర్పాకృతులను హుండీలో సమర్పిస్తే దోషనివారణ కలుగుతుందని బాగా నమ్ముతారు. ఆలయ ఆవరణలో వినాయకస్వామి, నాగులముద్దమ్మ, శనీశ్వర స్వామి, పద్మావతి, వేంకటేశ్వరస్వామి, అంజనేయస్వామి ఆలయాలతోపాటు ఆలయం వెనుక సువిశాల ప్రాంగణంలో త్రిమూర్తి, నక్షత్ర, నవగ్రహ, రాశి వనాలు ఉన్నాయి. ఐదు వారాలపాటు సాగే సోమవారోత్సవాలకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, తాగునీరు, స్నానపు గదులు, మరుగుదొడ్ల సౌకర్యం చేపట్టారు. అలాగే వేలాదిగా తరలివచ్చే భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కుప్పం ఆర్టీసీ డిపో వారు వీర్నమల, వి.కోట, కుప్పం, రాజుపేటక్రాస్ నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతారని తెలిపారు.

వాడవాడలా గణనాథుడి నిమజ్జనోత్సవం




గొల్లకండ్రిగలో ఊరేగింపు - :బుగ్గ అగ్రహారంలో అన్నదానం- కార్వేటినగరంలో ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లో పలు గ్రామాల్లో ఆదివారం వైభవంగా గణేశ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో గ్రామాల కూడలిల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి చెరువుల్లో నిమజ్జనం చేశారు.నింద్ర; పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనం సందర్భంగా మండపాల వద్ద ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. **విజయపురం;** నారపరాజుకండ్రిగ, శ్రీహరిపురం, కోసలనగరం, జంబాడ, పాతార్కాడు, గొల్లకండ్రిగ, ఎం.అగరం, పన్నూరు సబ్‌స్టేషన్, పన్నూరు, జగన్నాథపురం, కళియంబాకం, మాధవరం, ఆలపాకం, విజయపురం, మంగళం గ్రామాలలో వినాయక ప్రతిమను ఊరేగిస్తూ కోలాహలంగా నిమజ్జనం జరుపుకున్నారు.**నగరి:** బుగ్గఅగ్రహారం,ముడిపల్లిలో ఆదివారం గణేశ నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. పూజలు చేసి అన్నదానం చేశారు.చిత్తూరు పార్లమెంటరీ టీడీపీ అధికారప్రతినిధి చినబాబు, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బాలాజీ, జవహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.**పాలసముద్రం:** శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం, శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడ, వెంగళరాజుకుప్పం, బలిజకండ్రిగ, ఆముదాల, నరసింహాపురం, తిరుమలరాజుపురం గ్రామాల్లో విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

పూతలపట్టు: అమ్మేపల్లి, పేటఅగ్రహారం, ఎర్రచెరువుపల్లి దళితవాడలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి నిమజ్జనం చేశారు.




చిత్తూరు కట్టమంచి చెరువులో నిమజ్జనం సందర్భంగా హారతినిస్తున్న భక్తులు. కట్టమీద భక్తుల సందడి -ఊరేగింపుగా వస్తున్న వినాయక విగ్రహాలు